ఏజెన్సీ గ్రామంలో మద్యపాన నిషేధం

నల్లబెల్లి, సెప్టెంబర్ 21: వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలానికి సరిహద్దులో ఉన్న ఏజెన్సీ గ్రామం గొల్లపల్లె సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని అమలు చేసి ఆదర్శంగా నిలిచింది. గ్రామంలో 750 మంది జనాభా ఉండగా.. చాలా మంది యువత గుడుంబా, మద్యానికి బానిసై యుక్తవయస్సులోనే మృత్యువాత పడ్డా రు. దీంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయి. మరికొందరు గుడుంబాకు బానిసై కష్టపడి సంపాదించిదంతా తాగుడుకే ఖర్చు చేస్తున్నారు. కుటుంబాలను పట్టించుకోలేదు. దీంతో విసిగిపోయిన గ్రామప్రజలు.. గ్రామం బాగుపడాలంటే మద్యపాన నిషేధమొక్కటే మార్గమని నిర్ణయించుకున్నారు.

ఫార్మాసిటీని రద్దు చేయాలి

- మా భూములను వాపసు ఇవ్వాలి
- నాలుగు గ్రామాల రైతులు డిమాండ్
- సోనియా, రాహుల్‌కు లేఖలు

యాచారం, సెప్టెంబర్ 21: యాచారం మండలంలోని మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించిన ఫార్మాసిటీని వెంటనే రద్దు చేయాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు. ఆ మేరకు కాంగ్రెస్ అధిష్ఠానానికి లేఖలు రాస్తున్నారు. ఇప్పటికే నానక్‌నగర్ గ్రామానికి చెందిన 200 మంది రైతులు లేఖలు రాసిన విషయం తెలిసిందే. ఫార్మాసిటీ వద్దంటూ తాజాగా శనివారం కుర్మిద్ద గ్రామానికి చెందిన కొంత మంది రైతులు పోస్టుకార్డులతో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతోపాటు సీఎం రేవంత్‌రెడ్డికి లేఖలు రాశారు. కాలుష్యాన్ని వెదజల్లే ఫార్మాసిటీని రద్దుచేయాలని, తమ నుంచి సేకరించిన భూములను తిరిగి ఇవ్వాలని ఆ లేఖల్లో డిమాండ్ చేశారు. ఫార్మాసిటీని రద్దు చేస్తామని గతంలో హామీ ఇచ్చిన కాంగ్రెస్ నాయకులు అధికారంలోకి వచ్చాక మాట మార్చడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఫార్మాసిటీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎన్నికలకు ముందు ఓట్ల కోసం రైతులతో కలిసి పాదయాత్ర చేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క, ఎమ్మెల్సీలు కోదండరామ్, తీన్మార్ మల్లన్న, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి తదితరులు ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పదవులను చేపట్టగానే ఫార్మా బాధిత రైతులను మర్చిపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యూచర్‌సిటీ అంటున్నారే తప్ప ఫార్మాసిటీని రద్దు చేసినట్టు ఎక్కడా జీవో చూపించడం లేదని మండిపడుతున్నారు. పైగా ఫార్మాసిటీని నిర్మించి తీరుతామని హైకోర్టులో ప్రభుత్వం అఫిడవిట్ వేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రజల ఇబ్బందులను అర్థం చేసుకుని ఇప్పటికైనా ఫార్మాసిటీని రద్దు చేయాలని కాంగ్రెస్ అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు. లేకుంటే ఫార్మా వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో ఆందోళనలను ఉద్ధృతం చేస్తామని, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులను తమ గ్రామాల్లో తిరుగనివ్వబోమని హెచ్చరించారు.

ఫార్మాసిటీ వద్దంటూ రాసిన ఉత్తరాన్ని చూపుతున్న తాటిపర్తి గ్రామ మహిళ

ముల్కనూరు ప్రజాగ్రంథాలయం

ప్రజాగ్రంథాలయంలో నేడు దశాబ్ది ఉత్సవాలు

- 2023 కథల పోటీల విజేతలకు బహుమతుల పంపిణీ
- 'నమస్తే తెలంగాణ-ముల్కనూరు ప్రజాగ్రంథాలయం' నిర్వహణ

హనుమకొండ సబర్బన్, భీమదేవరపల్లి, సెప్టెంబర్ 21: ముల్కనూరు ప్రజాగ్రంథాలయం దశాబ్ది ఉత్సవాలకు సిద్ధమైంది. 'నమస్తే తెలంగాణ' దినపత్రిక-ముల్కనూరు ప్రజాగ్రంథాలయం సంయుక్తంగా ఏటా కథల పోటీలు నిర్వహిస్తున్నది. ఇదే తరహాలో నిర్వహించిన 'కథల పోటీలు-2023' విజేతల ఎంపిక ప్రక్రియ పూర్తికాగా.. ఆదివారం దశాబ్ది ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఇదే వేదికపైనే విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూరు మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో 2014లో ఆ గ్రామ పూర్వ విద్యార్థులు ప్రజాగ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. అంచెలంచెలుగా ఎదిగి ముల్కనూరు ప్రజాగ్రంథాలయంగా రూపుదిద్దుకొన్నది. నిత్యం వందలాది మందితో కిటకిటలాడే ఈ గ్రంథాలయం ఇప్పుడు దశాబ్ది ఉత్సవాలకు ముస్తాబైంది. ముఖ్య అతిథులుగా రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, మాజీ మంత్రి కెప్టెన్ లక్ష్మీకాంతారావు, మాజీ ఎమ్మెల్యేలు వొడితెల సతీశ్‌కుమార్, అల్లిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, తెలుగు కవి అందెశ్రీ, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, హనుమకొండ జడ్పీ మాజీ చైర్మన్ మారపల్లి సుధీర్‌కుమార్, నమస్తే తెలంగాణ దినపత్రిక ఎడిటర్ తిగుళ్ల కృష్ణమూర్తి హాజరుకానున్నట్టు నిర్వాహకులు సీఎంవో ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, మాజీ జడ్పీటీసీ వంగ రవి తెలిపారు.

ఎల్లంపల్లిని పూర్తి చేసిందెవరు?

- కాంగ్రెస్ ప్రాజెక్టు పూర్తి చేస్తే నీళ్లెందుకు నింపలె?
- మంత్రి పొన్నం వ్యాఖ్యలపై నెటిజన్ల విమర్శలు

హైదరాబాద్, సెప్టెంబర్21 (నమస్తే తెలంగాణ): 'కాంగ్రెస్ హయాంలోనే ఎల్లంపల్లి పూర్తయిందని, ఆ ప్రాజెక్టు నుంచే మల్లన్నసాగర్ వరకు రిజర్వాయర్లన్నీ నింపామని, అవి కాళేశ్వరం జలాలు కావు' అని బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలపై తెలంగాణవాదుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మంత్రి గప్పాలు తప్ప మరేమీలేదని నెటిజన్లు విమర్శలు గుప్పిస్తున్నారు. వాస్తవంగా ఎల్లంపల్లి ప్రాజెక్టును తా మే నిర్మించామని కాంగ్రెస్ సర్కారు చెప్తున్న గొప్పలన్నీ కూడా ఒట్టి మాటలే. ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేసినా దానిని వినియోగంలోకి తీసుకురాలేదన్నది అంతే వాస్తవం. జలయజ్ఞంలో భాగంగా 2004లో రూ.3,177 కోట్ల తో 20.16టీఎంసీల నీటి నిల్వసామర్థ్యంతో ఎల్లంపల్లి ప్రాజెక్టును చేపట్టారు. తెలంగాణ వచ్చేనాటికి ప్రాజెక్టుపై రూ.3,347.27 కోట్లు ఖర్చుపెట్టారు. తెలంగాణ ఏర్పడేనాటికి ఏనా డూ ఆ రిజర్వాయర్‌లో 5 టీఎంసీలకు మించి జలాలను నిల్వ చేయలేదు. కారణం భూసేకరణ పూర్తి చేయకపోవటం, ముంపు బాధితులకు పునరావాసం కల్పించకపోవడమే. ప్రాజెక్టు కోసం మొత్తంగా 27,387ఎకరాల భూమిని సేకరించాల్సి ఉండగా, 18,778 ఎకరాలను మాత్రమే సేకరించింది. ఇక పునరావాసం కల్పనకు 13,296 ఇండ్లను నిర్మించాల్సి ఉండగా, 1,448 ఇండ్లను మాత్రమే పూర్తిచేసింది. అదీగాక ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో నీటినిల్వ వల్ల లక్షేటిపేట బ్రిడ్జి మునిగిపోయి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలకు రాకపోకలు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది. కానీ తెలంగాణ ఏర్పాటు తర్వాత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మరో రూ.2,052.73 కోట్లను వాటి కోసం వెచ్చించింది. బరాజ్‌ను 2016లో పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకొచ్చింది. ఇదీ వాస్తవం. కానీ అందుకు విరుద్ధంగా ప్రాజెక్టు మొత్తం పూర్తిచేశామని మంత్రి పొన్నం వ్యాఖ్యానించడంపై తెలంగాణవాదులు విమర్శలు గుప్పిస్తున్నారు. అదీగాక ఎల్లంపల్లి నుంచే నీళ్లను తరలించామని చెబుతున్న మంత్రి పొన్నం వాటిని ఏవిధంగా తరలించారో కూడా చెబితే బాగుండేదని చురకలంటిస్తున్నారు. మంత్రి పొన్నం వ్యాఖ్యలు ఆయన అవగాహన రాహిత్యానికి నిదర్శనమని తెలంగాణవాదులు వివరిస్తున్నారు. అం తేకాదు అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు రూపకల్పన చేసిన ప్రాజెక్ట్‌లోనే ఎల్లంపల్లి, నందిమేడారం, లక్ష్మీబరాజ్, మిడ్ మానేర్, అనంతగిరి రిజర్వాయర్, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ భాగమై ఉన్నాయని అంగీకరించిన పొన్నం మరి ఆ యా రిజర్వాయర్లను నాడు ఎందుకు పూర్తి చేయలేదో కూడా చెబితే బాగుండేదని తెలంగాణవాదులు ప్రశ్నిస్తున్నారు. అంతేకాకుండా కేసీఆర్ రీడిజైన్ ఫలితంగానే ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టులో 14టీఎంసీలుగా నీటి నిల్వ సామ ర్థ్యం ఏకంగా 141టీఎంసీలకు పెరిగిందని తెలంగాణవాదులు గుర్తుచేస్తున్నారు.

ఎల్లంపల్లి నుంచే నీళ్లు ఎత్తిపోశాం: పొన్నం

హైదరాబాద్, సెప్టెంబర్21 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ హయాంలోనే ఎల్లంపల్లి పూర్తయిందని, ఆ ప్రాజెక్టు నుంచే ప్రస్తు తం మల్లన్నసాగర్ వరకు రిజర్వాయర్లన్నీ నింపామని, అయినా కాళేశ్వరం జలాలు అంటూ మాజీ మంత్రి హరీశ్‌రావు తప్పుదోవ పట్టిస్తున్నారని బీసీ సంక్షేమశాఖ మం త్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టులోనే రూపకల్పనలోనే ఎల్లంపల్లి , నందిమేడారం, లక్ష్మీబరాజ్, మిడ్ మానేర్, అనంతగిరి రిజర్వాయర్, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగ ర్ భాగమై ఉన్నాయని చెప్పారు. గాంధీ భవన్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పొన్నం మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలోనే ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తయిందని తెలిపారు. కేసీఆర్ చేసిన రీడిజైన్ నిరుపయోగమని, మిడ్‌మానేరు, లోయర్ మానేరు, కొండపోచమ్మ సాగర్, మల్లన్నసాగర్‌కు వచ్చే నీరు ఎల్లంపల్లి నుంచి తీసుకున్నవి మాత్రమేనని, విడతల వారీగా వర్షాలు కురవడం వల్లే అది సాధ్యమైందని తెలిపారు. ఆగిన పనులు పూర్తి చేసినంత మాత్రాన ప్రాజెక్టు రూపొందించినట్టవుతుందా? అని ప్రశ్నించారు.

ఫార్మాసిటీ అక్కడే ఉంటుందా..లేదా?

మొదటిపేజీ తరువాయి...

ఇవ్వడంలేదని తప్పుపట్టారు. ఫార్మాసిటీ భూములకు సంబంధించిన పిటిషన్లపై సోమవారం విచారణ చేపడతామని, ఆ లోగా ప్రభుత్వ నిర్ణయంతోపాటు ఫార్మాసిటీకి సంబంధించిన అన్ని వివరాలను తెలియజేయాల్సిందేనని తేల్చిచెప్పారు. కాగా, ఫార్మాసిటీ యథాతథంగా కొనసాగుతుందంటూ హైకోర్టులో ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసింది. ఫార్మాసిటీ రద్దయినట్టు కొన్ని పత్రికల్లో వచ్చిన వార్తల్లో వాస్తవం లేదని రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ ఆ అఫిడవిట్‌లో పేర్కొంటూ.. 2016 లో జారీ చేసిన జీవో 31 ప్రకారం ఫార్మాసిటీ యథావిధిగా కొనసాగుతుందని వెల్లడించారు. హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ ఏర్పాటు కోసం మేడిపల్లిలో 1,700 ఎకరాల సేకరణకు భూసేకరణ చట్టంలోని సెక్షన్ 11(1) కింద గతంలో ప్రాథమిక నోటిఫికేషన్ వెలువడిందని గుర్తుచేశారు. అంతకుముందు ఇదే ఫార్మాసిటీ ఏర్పాటు కోసం 2016లో ప్రభుత్వం జీవో 31ను జారీ చేసిందని, అంతేకాకుండా భూసేకరణ చట్టం కింద కొన్ని మినహాయింపులు ఇస్తూ జీవో 46ను జారీ చేసిందని తెలిపారు. డిక్లరేషన్, పరిహారం అవార్డు నిబంధనల ప్రకారం జరగలేదన్న ఆరోపణలు అవాస్తవమని, భూసేకరణ చట్టంలోని నిబంధనల ప్రకారమే అక్కడ భూసేకరణ చేపట్టామని పేర్కొన్నారు. ప్రభుత్వం సేకరించిన భూముల్లో పిటిషనర్‌కు సంబంధించిన 10 ఎకరాలు ఉన్నాయని తెలిపారు. డిక్లరేషన్ అవార్డుపై పిటిషనర్ హైకోర్టును ఆశ్రయించారని, విచారణ జరిపిన హైకోర్టు.. అభ్యంతరాల స్వీకరణ సహా భూసేకరణ ప్రక్రియను కొనసాగించాలని ఆదేశించిందని వివరించారు. ఈ ఆదేశాల ప్రకారం భూసేకరణకు సంబంధించిన ప్రాథమిక నోటిఫికేషన్ అమల్లోనే ఉన్నదని, ఈ నేపథ్యంలో సదరు భూములపై ధరణి పోర్టల్‌లో లావాదేవీలకు అనుమతించాలన్న పిటిషన్‌ను కొట్టివేయాలని కోరారు. పిటిషనర్ తన భూములపై ధరణి పోర్టల్ ద్వారా ఎలాంటి లావాదేవీలు నిర్వహించలేరని పేర్కొన్నారు. భూసేకరణ ప్రక్రియ అమల్లో ఉన్నందున ధరణిలో ఎంట్రీల కోసం పిటిషనర్ చేసుకున్న దరఖాస్తును అనుమతించలేమని స్పష్టం చేశారు. అంతేకాకుండా అవార్డు నోటిఫికేషన్‌ను రద్దు చేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులపై అప్పీళ్లు దాఖలు చేశామని, అవి ధర్మాసనం ముందు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. భూసేకరణ నిమిత్తం రెండు పత్రికల్లో నోటిఫికేషన్‌ను ప్రచురించామని, గ్రామసభ నిర్వహించి నోటీసులు జారీచేయడంతోపాటు హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ ఏర్పాటు ఆవశ్యకతను అందరికీ వివరించామని చెప్పారు. ఫార్మాసిటీ కోసం సేకరించిన భూములకు ఎకరాకు రూ.12.50 లక్షల చొప్పున్న పరిహారం ఇవ్వాలని తొలుత నిర్ణయించినప్పటికీ ఆ తర్వాత దాన్ని రూ.16 లక్షలకు పెంచామని, దానికి అదనంగా రైతులకు 121 చదరపు గజాల చొప్పున స్థలాలను కూడా కేటాయిస్తున్నామని వివరించారు. నోటీసులకు సమాధానం ఇవ్వనందున అధికారులు జారీ చేసిన పరిహారం మొత్తాన్ని భూసేకరణ అథారిటీ వద్ద డిపాజిట్ చేశామని తెలిపారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల విధుల బహిష్కరణ

నాలుగు నెలలుగా జీతాలు రాకపోవడంతో వనపర్తి జిల్లా కొత్తకోట సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్, వాచ్‌మెన్, ప్లాంబర్ కం ఎలక్ట్రీషన్, గెస్టు ఫ్యాకల్టీ ఉద్యోగులు శనివారం విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. జీతాలు ఇవ్వకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. గతంలో ఎన్నడూ ఇలాంటి సమస్య రాలేదని, ఇప్పటికైనా ప్రభుత్వం వేతనాలు త్వరగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. -కొత్తకోట

దక్షిణ మధ్య రైల్వే
Follow us on X @SCRailwayindia
ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inపై చూడవచ్చును.

టెండరు నోటీస్

భారత రాష్ట్రపతి తరపున సీనియర్ డివిజనల్ సిగ్నల్ & టెలికాం ఇంజినీర్, సికింద్రాబాద్ డివిజన్, దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ వారు దిగువ పనుల కొరకు 15.00 గంటల వరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా బహిరంగ టెండర్లు కోరుచున్నారు.
C_SG_36_516, 04/10/2024,
C_SG_36_517, 09/10/2024,
C_SG_36_518, 09/10/2024

క్ర.సం.1, టెండరు నం. C_SG_36_518, తేది: 18-09-2024. పని పేరు: 12 నెలల కాలానికి SC డివిజన్‌పై DSTE/KMT సబ్ డివిజన్ సెక్షన్‌లో సిగ్నల్ మెయింటెనెన్స్ అసెట్స్‌కు మరమ్మతులు చేపట్టుట. సుమారు విలువ: రూ.71,11,964.96/-, బిడ్ సెక్యూరిటీ/ బయానా: రూ.1,42,200/-, టెండరు బుక్ ధర: రూ. 0/-

క్ర.సం.2, టెండరు నం. C_SG_36_ 517, తేది: 18-09-2024. పని పేరు: 12 నెలల కాలానికి SC డివిజన్‌పై DSTE/BPA సబ్ డివిజన్ సెక్షన్‌లో సిగ్నల్ మెయింటెనెన్స్ అసెట్స్‌కు మరమ్మతులు చేపట్టుట. సుమారు విలువ: రూ.71,59,220/-, బిడ్ సెక్యూరిటీ/ బయానా: రూ.1,43,200/-, టెండరు బుక్ ధర: రూ. 0/-

క్ర.సం.3, టెండరు నం. C_SG_36_516, తేది: 13-09-2024. పని పేరు: 1. MAGH-GDCR సెక్షన్‌కు సంబంధించి సిగ్నలింగ్ అరేంజిమెంట్స్: RAJU-PRPI స్టేషన్ మానిక్‌గర్- గడ్చండూర్ సెక్షన్ మధ్య కి.మీ.6/14-7/1 వద్ద LC NO.3(M) SL (2X5.5X5M) బదులుగా డబుల్ వెంట్‌తో రోడ్ అండర్ బ్రిడ్జ్ (RUB) ప్రతిపాదిత నిర్మాణం. (ఓపెన్ కట్ & కాస్ట్-ఇన్-సిటు పద్ధతి ద్వారా). 2. ప్రతిపాదిత KZJ-BPQ సెక్షన్‌కు సంబంధించి సిగ్నలింగ్ అరేంజిమెంట్స్: OPL-JMKT స్టేషన్స్ మధ్య కి.మీ.342/19 వద్ద LC NO.13 నుండి LC NO.14 వరకు లింక్ రోడ్ ఏర్పాటుచేయుట ద్వారా కి.మీ. 343/23-25 వద్ద కాపలాగల LC NO.13 క్లోజర్. 3. NH KM NO.108+445 ఆఫ్ 563 వద్ద PDPL-KZJ సెక్షన్‌పై HSP-OPL స్టేషన్స్ మధ్య రైల్వే కి.మీ.353/702 వద్ద కాంపోజిట్ గిర్డర్ స్పాన్ 1X37.280 M(C/C OF PIER) తో A4 లేన్ ROB ప్రతిపాదిత నిర్మాణం. (డిపాజిట్). సుమారు విలువ: రూ. 1,12,63,753.63/-, బిడ్ సెక్యూరిటీ/బయానా: రూ.2,06,300/-, టెండరు బుక్ ధర: రూ. 0/-

తదుపరి వివరాలకు వెబ్‌సైట్ www.ireps.gov.in ను దర్శించండి. బిడ్ సెక్యూరిటీ/బయానా GCC 2022 ప్రకారం చెల్లించాలి.
* IRSGCC-2022 ప్రకారం, ఇ-టెండరు ఫారాలు టెండరుదారులు అందరికి ఉచితంగా జారీచేయబడును (Ref: IRGCC 2022 పార్ట్-I, క్లాజ్-3)
సీనియర్ డివిజినల్ సిగ్నల్ & టెలికాం ఇంజినీర్/కో-ఆర్డ్/ సికింద్రాబాద్
PUB/0936/24

ఇ-టెండరు నోటీస్ నం. ELS/BZA-eTN-13-2024-25 తేది: 18-09-2024
PUB/0939/24

దిగువ తెలిపిన పనుల కొరకు దిగువ సంతకందారు భారత రాష్ట్రపతి తరపున 10.10.2024న 15.00 గం.వరకు ఇ-టెండర్లు కోరుతున్నారు.

క్ర.సం.1. టెండర్ నం.B/E.221/ TRS/ RC/514, ఇటెండర్ నెం.ELS-BZA-eTN-13-2024-25 తేది: 18.09.2024, పని వివరాలు: పని పేరు: రెండు (2) సంవత్సరాల కాలానికి ఎల్రక్టిక్ లోకో షెడ్, విజయవాడ వద్ద మేజర్ షెడ్యూల్స్ (pu పేయింటింగ్- 57 లోకోస్ మరియు ఎనామిల్ పెయింటింగ్-37 లోకోస్) లో BG ఎల్రక్టిక్ లోకోమోటివ్స్ యొక్క పేయింటింగ్, పరిమాణం: 94 లోకోస్. పూర్తిచేయుకాలం: 24 నెలలు, టెండర్ విలువ: రూ.60,19,002.75/-, బయానా: రూ.1,20,400, టెండర్ డాక్యుమెంట్ ధర: లేదు, టెండర్ ముగింపు తేది సమయం: 10.10.2024న 15.00 గం.

కాగోర టెండరుదారులు ఏదేని టెండరు కొరకు ఏవేని మార్పులు/ సవరణలను గమనించుటకు టెండరు ముగింపు తేదీకి ముందు వెబ్‌సైట్: www.ireps.gov.in దర్శించవల్సిందిగా సూచించబడుతున్నారు.
సీనియర్ డివిజినల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ (టిఆర్ఎస్), ELS, విజయవాడ
A1203

తదుపరి టెండరు నిబంధనలు/వివరాల కోసం మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కోసం వెబ్‌సైట్ https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in దర్శించండి

ధాన్యం కొనుగోలులో అవకతవకలు

కంచనపల్లి సొసైటీ వైస్ చైర్మన్ సస్పెన్షన్

రఘునాథపల్లి, సెప్టెంబర్ 21: ధాన్యం కొనుగోలు కేంద్రంలో తూకంలో మోసాలకు పాల్పడిన వైస్ చైర్మన్ మూడు ధర్మను సస్పెండ్ చేశారు. ఈ మేరకు డీసీవో రాజేందర్‌రెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. డీసీవో తెలిపిన వివరాల ప్రకారం.. కంచనపల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కుసుంబాయి తండాలోని కొనుగోలు కేంద్రంలో రైతుల వద్ద నుంచి ధర్మ బస్తాలో 41 కిలోల ధాన్యానికి బదులు 43 నుంచి 45 కిలోలు తూకం వేసి మోసం చేశారని పలువురు రైతులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై డీసీవో విచారణ చేపట్టగా ధర్మ పొంతన లేని సమాధానాలు చెప్పడంతో అవినీతి వెలుగు చూసింది. దీంతో వైస్ చైర్మన్ మూడు ధర్మను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే కంచనపల్లి సీఈవో, చైర్మన్ సస్పెండ్ కాగా, తాజా నిర్ణయం మండలంలో చర్చనీయాంశమైంది.

టీ-పీసీసీ అధ్యక్షుడిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

జఫర్‌గడ్, సెప్టెంబర్ 21 : టీ-పీసీసీ అధ్యక్షుడిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన మహేశ్‌కుమార్‌గౌడ్‌ను మండలంలోని కాంగ్రెస్ నాయకులు శనివారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ కడియం కావ్య ఆధ్వర్యంలో జఫర్‌గఢ్ సొసైటీ చైర్మన్ తీగల కరుణాకర్‌రావు, జిల్లా నాయకులు గుజ్జరి రాజు, మండల పార్టీ అధ్యక్షుడు నూకల ఐలయ్య కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గాదెపాక అయోధ్య, నాయకులు యాదగిరి, కుల్లా మోహన్‌రావు, అన్నెపు అశోక్, బొమ్మినేని పెద్దిరెడ్డి, గండి రమేశ్, రాజిరెడ్డి, శిరీశ్‌రెడ్డి పాల్గొన్నారు.

'ప్రపంచ శాంతి'పై వ్యాసరచన పోటీలు

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 21 : ప్రపంచ శాంతి దినోత్సవం సందర్భంగా వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ వారు హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు 'ప్రపంచ శాంతి విద్యార్థుల పాత్ర' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సంస్థ అంతర్జాతీయ అధ్యక్షుడు ప్రొఫెసర్ సురేశ్ లాల్ మాట్లాడుతూ.. రేపటి శాంతిమయ ప్రపంచం కోసం యువత పూనుకోవాలన్నారు. సంస్థ వ్యవస్థాపకుడు సిరాజుద్దీన్ మాట్లాడుతూ.. ఐక్యరాజ్యసమితి గుర్తింపు పొందిన తమ సంస్థ వరంగల్ కేంద్రంగా 27 సంవత్సరాలుగా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నదన్నారు. కార్యక్రమంలో సంస్థ అంతర్జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీపాద సుధాకర్‌రావు, సంయుక్త కార్యదర్శి మంజుల, సభ్యులు మండల పరశురాములు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

జనగామ చౌరస్తా, సెప్టెంబర్ 21 : హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో ఈ నెల 19, 20 తేదీల్లో నిర్వహించిన 10వ రాష్ట్ర స్థాయి సౌత్ జోన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ఉత్తమ ప్రతిభకనబర్చారు. అండర్-18 పురుషుల విభాగంలో జీ సునీత్ కుమార్ షాట్‌పుట్, డిస్కస్ త్రోలో రెండు బంగారు పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. బాలికల విభాగంలో అక్షయ సింధు షాట్‌పుట్‌లో కాంస్యం, డిస్కస్ త్రోలో రజత పతకాన్ని సాధించింది. వీరిని తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి కొదురుపాక సారంగపాణి, జనగామ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పెద్ది వెంకటనారాయణ గౌడ్, గంగిశెట్టి మనోజ్ కుమార్, ఆవుల అశోక్, వంచ చంద్రశేఖర్‌రెడ్డి, గజ్జల రాజు, కోచ్ తూడి రంజిత్ కుమార్, రాజు, సురేశ్, హేమలత, సంధ్య, సంగీత అభినందించారు.

ఉత్తమ ప్రతిభ కనబర్చిన జనగామ జిల్లా క్రీడాకారులు

మాట్లాడుతున్న నోడల్ ఆఫీసర్ పోతుగంటి నర్సయ్య

27 నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడలు

పాలకుర్తి : ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 27 నుంచి క్రీడోత్సవాలు నిర్వహిస్తున్నట్లు మండల నోడల్ ఆఫీసర్ పోతుగంటి నర్సయ్య తెలిపారు. స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో శనివారం నిర్వహించిన వ్యాయామ ఉపాధ్యాయులు సమావేశంలో ఆయన మాట్లాడారు.14, 17 ఏళ్ల బాల బాలికలకు కబడ్డీ , వాలీబాల్, ఖోఖో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 27న గూడూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలురకు, 28న పాలకుర్తిలోని తెలంగాణ బాలికల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో బాలికలకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు నర్సయ్య వివరించారు. ఈ పోటీల్లో మండలంలోని అన్ని యాజమాన్య పాఠశాలలకు చెందిన క్రీడాకారులు పాల్గొనేలా చూడాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ మండల కార్యదర్శి సోమ్మల్లు, పీడీ కన్వీనర్ కూటికంటి శ్రీనివాస్, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్లు స్పందన, గట్టు మనోహర్, మధు, గణేశ్ పాల్గొన్నారు.

భర్త కాపురానికి తీసుకెళ్లడం లేదని ఆందోళన

కూతురుతో కలిసి అత్తవారింటి ముందు నిరసన

తరిగొప్పుల, సెప్టెంబర్ 21: భర్త కాపురానికి తీసుకుపోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తూ కూతురుతో కలిసి ముందు మహిళ ఆందోళన నిర్వహించిన ఘటన మండలంలోని అక్కరాజుపల్లిలో శనివారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. అక్కరాజుపల్లికి చెందిన సుంకరి సంధ్యకు ఇదే గ్రామానికి చెందిన పురమాని సంపత్‌కు 2013లో వివాహం జరిగింది. నాడు కట్నంగా రూ.3 లక్షలు ఇచ్చారు. అనంతరం వీరికి కూతురు కలిగింది. కొంతకాలంగా వరకట్నం విషయంలో భార్యభర్తల మధ్య మనస్పర్ధలు రావడంతో సంధ్య పుట్టింటికి వెళ్లింది. దీనిపై పలుమార్లు పెద్ద సమక్షంలో పంచాయితీ నిర్వహించినా పరిష్కారం కాలేదు. ఇటీవలో సంపత్ మరో మహిళతో వివాహం చేసుకున్నాడని తెలియడంతో సంధ్య తన కూతురుతో కలిసి శనివారం భర్త ఇంటి ముందు బైఠాయించి ఆందోళన చేపట్టింది. దీనిపై సంపత్‌ను వివరణ కోరగా వివాహం అనంతరం ఏడాది తనతో సంధ్య కలిసి ఉందని, ఈ క్రమంలో పాప జన్మించిందన్నాడు. అనంతరం గొడవలు జరగడంతో పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీ జరగగా పెళ్లి నాడు ఇచ్చిన రూ.3 లక్షలను తిరిగి చెల్లించడంతో సంధ్య ఆమె కుటుంబానికి అందజేసిందని తెలిపాడు. పెద్ద మనుషుల సమక్షంలో తనను కాలుతో తన్నిం దన్నాడు. 2016లో హనుమకొండలోని మహిళా పోలీసు స్టేషన్‌లో నా తల్లిదండ్రులు కనకమ్మ, యాదయ్య, సోదరుడు రమేశ్‌తోపాటు తనపై వరకట్నంపై కేసు పెట్టిందని తెలిపాడు. అప్పటి నుంచి కోర్టు చుట్టూ తిరుగుతున్నానని వివరించాడు. అనంతరం జనగామ కోర్టులో విడాకుల కోసం దరఖాస్తు చేయగా 2022లో కోర్టు ఉత్తర్వులు ఇచ్చిందన్నాడు. అందుకే మరో పెళ్లి చేసుకున్నానని తెలిపాడు. దీనిపై ఎస్సై అయ్యాల శ్వేత మాట్లాడుతూ సంపత్ ఇంటికెళ్లి గొడవ చేసిన సంధ్య కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేశామన్నారు.

సిద్దెంకిలో నీరు లేక ఎండిపోయిన పొలాన్ని చూపిస్తున్న రైతు

గోదావరి జలాలున్నా అందని సాగునీరు

ఎండిపోతున్న పంట పొలాలతో రైతుల ఆందోళన

జనగామ రూరల్, సెప్టెంబర్ 21 : ఒకప్పుడు తీవ్ర దుర్భిక్షం నెలకొన్న జనగామ ప్రాంతంలో బీఆర్‌ఎస్ పాలనలో పెద్ద ఎత్తున సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం జరగడంతో బీడు భూములు పచ్చగా మారాయి. గత పదేళ్లలో చెరువులు, కుంటల్లో నీరుండి పొలాల సాగు పెరిగింది. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక దేవాదుల రిజర్వాయర్లలో నీరున్నా కాల్వలకు విడుదల చేయకపోవడంతో జనగామ మండలంలో వరి పంట ఎండిపోతున్నది. అయినా పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో పంట పొలాలకు నీరందడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. జనగామ మండలం సిద్దెంకి, పసరమడ్ల, అడవికేశ్వాపూర్, చీటకోడూరు తదితర గ్రామాల్లో చెరువులకు నీరందక వరి పంటలు ఎండిపోతున్నాయి. ఈ సారి సమృద్ధిగా వర్షాలు కురవలేదు. అయినా దేవాదుల రిజర్వాయర్లలోని నీటిని విడుదల చేయక పోవడంతో పంటలు ఎండిపోతున్నాయని పలువురు 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. ఇప్పటికైనా నీటిపారుదల శాఖ అధికారులు స్పందించి దేవాదుల రిజర్వాయర్ల నుంచి విడుదల చేస్తే మండలంలోని చెరువులను నింపడం ద్వారా సాగునీరు అందించవచ్చని పలువురు రైతులు తెలిపారు.

24న బల్దియా సర్వసభ్య సమావేశం

వరంగల్, సెప్టెంబర్ 21 : వరంగల్ మహా నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం ఈ నెల 24న నిర్వహించనున్నట్లు బల్దియా కార్యదర్శి విజయలక్ష్మి ప్రకటించారు. మేయర్ గుండు సుధారాణి అధ్యక్షతన బల్దియా కౌన్సిల్ హాల్‌లో సమావేశం జరుగుతుందన్నారు. ఎజెండాలోని ఏడు అంశాలపై సమావేశంలో చర్చించి ఆమోదం తెలుపనున్నారు. సభ్యులు సకాలంలో సమావేశానికి హాజరు కావాలని ఆమె కోరారు.

సఖీ సెంటర్‌లో అవగాహన కార్యక్రమం

హనుమకొండ, సెప్టెంబర్ 21 : హనుమకొండ ఎక్సైజ్ కాలనీలోని సఖీ వన్‌స్టాప్ సెంటర్‌లో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు సెంటర్ అడ్మినిస్ట్రేటర్ హైమావతి తెలిపారు. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళా శిశు దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో సఖీ సెంటర్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్సీ అమీర్‌అలీ ఖాన్‌ను సన్మానిస్తున్న ముస్లిం, మైనార్టీలు

ఎమ్మెల్సీ అమీర్‌అలీ ఖాన్‌కు ఘన సన్మానం

జనగామ, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ) : ఎమ్మెల్సీగా ఎన్నికైన అనంతరం తొలిసారి జనగామకు వచ్చిన అమీర్‌అలీ ఖాన్‌ను శుక్రవారం జమాల్ షరీఫ్ ఆధ్వర్యంలో ముస్లిం, మైనార్టీ నాయకులు ఘనస్వాగతం పలికి సత్కరించారు. ముస్లిం, మైనార్టీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల అభ్యున్నతికి కృషి చేయాలని వారు కోరారు. ఆలీఖాన్‌ను సన్మానించిన వారిలో సంఘం పెద్దలు మౌలానా అబ్దుల్ హఫీజ్, కౌన్సిలర్ బొట్ల శ్రీనివాస్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, జావెద్, నాయిద్ ఆరీఫ్, మోతీన్, అతార్, సౌలత్, గౌస్, యాకూబ్ ఉన్నారు.

తల్లిదండ్రులు పిల్లల చదువుపై శ్రద్ధ చూపాలి

నర్మెట, సెప్టెంబర్ 21: విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులే కాకుండా తల్లిదండ్రులు కూడా శ్రద్ధ చూపాలని జిల్లా విద్యాశాఖ అధికారి కే రాము అన్నారు. శనివారం మండలంలోని మల్కపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో హెచ్‌ఎం కేశవరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి డీఈవో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు ఉన్నాయని, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్యాబోధన జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు వినియోగించుకోవాలని కోరారు. అనంతరం దాతల సహాయంతో విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోటు బుక్స్, ప్లేట్లు, వాటర్ బాటిళ్లను అందించారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి ఎం ఐలయ్య, ఉపాధ్యాయులు మధుసూదన్, అంజనేయులు, ఏపీసీ సులోచన, సీఆర్పీ రవీందర్, పంచాయతీ కార్యదర్శి శ్రీలత పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు అందిస్తున్న డీఈవో రాము

తల్లిని హత్య చేసిన తనయుడు

ఆర్థికంగా ఆదుకోలేదని ఘాతుకం

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబర్ 21 : ఆర్థికంగా ఆదుకోవడం లేదని ఓ కొడుకు తన తల్లి తలపై ఇనుపరాడ్‌తో బాది హత్య చేసిన ఘటన జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని నమిలిగొండలో చోటుచేసుకుంది. స్థానిక సీఐ జీ వేణు కథనం మేరకు.. గ్రామానికి చెందిన సముద్రాల లక్ష్మీ (65)కి ముగ్గురు కూతుళ్లు, ఇద్దరు కొడుకులున్నారు. చిన్న కుమారుడు సతీశ్ మూడేళ్ల క్రితం మడికొండ వద్ద రోడ్డు ప్రమాదానికి గురికాగా, అప్పటి నుంచి ఏ పని చేయకుండా కాజీపేటలో ఖాళీగా తిరుగుతున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం సత్తయ్య తన తల్లి ఇంటికి వచ్చాడు. అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతంలో లక్ష్మీ ఇంట్లో నుంచి అరుపులు వినపడడంతో ఆమె పెద్ద కుమారుడు రాజు వెళ్లి పిలువగా తలుపు తీసిన సతీశ్ ఇనుప రాడ్‌తో దాడికి యత్నించాడు. వెంటనే పక్క ఇంటి వారిని లేపిన రాజు 100కి ఫోన్ చేశాడు. అనంతరం ఇంట్లోకి వెళ్లి చూడగా లక్ష్మీ తలకు తీవ్ర గాయాలతో మృతి చెంది కనిపించింది. రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని సతీశ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.



సతీశ్ అరెస్టును చూపుతున్న పోలీసులు

నిట్‌లో పూర్వవిద్యార్థుల సమ్మేళనం

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 21 : నిట్‌లో విద్యార్థిగా ప్రవేశించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 1974-79 బీటెక్ పూర్వ విద్యార్థులు స్వర్ణోత్సవం నిర్వహించారు. గ్రాడ్యుయేషన్‌ను అభ్యసించిన 216 మందిలో ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుంచి వారి కుటుంబాలతో పాటు 60 ఏళ్లు పైబడిన 40 మంది పూర్వవిద్యార్థులు క్యాంపస్‌ను సందర్శించారు. బోస్ హాల్‌లో రీ యూనియన్‌ను ఏర్పాటు చేశారు. వారి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సరదాగా గడిపారు. సాయంత్రం నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి, ఇంటర్నేషనల్ రిలేషన్స్ అండ్ ఆలుమ్నీ అఫైర్స్ డీన్ శ్రీనివాసరావును సత్కరించారు.